చేతులెత్తి తీర్మానాన్ని ఆమోదిస్తున్న ప్రతినిధులు

స్ఫూర్తిదాయకంగా చర్చలు

- కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు
- ఉత్తేజంగా కొనసాగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభ
- నేడు మహా ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / అనతలవట్టం ఆనందన్ నగర్

గత నెల 31న ప్రారంభమైన సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఆదివారంతో ముగియనుంది. విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఆహ్లాదకర వాతావరణంలో, ఉత్తేజపూరితమైన చర్చలతో గడిచిన నాలుగు రోజుల పాటు సభలో ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధుల సభలో విస్తృత చర్చ జరుగుతోంది. గడచిన మూడేళ్లలో దేశంలో పలుచోట్ల జరిగిన కార్యకలాపాల నివేదికపై 59 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. తర్వాత ప్రవేశపెట్టిన నిర్మాణ నివేదికపై 52 మంది చర్చల్లో భాగస్వాములయ్యారు. బిజెపి కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలపై ఈ సందర్భంగా 1300 మంది ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. దేశ వ్యాప్తంగా ప్రత్యామ్నాయ విధానాలపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈ మహాసభలో చర్చలు సాగాయి.

అఖిల భారత నాయకత్వం దిశానిర్దేశం

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరుగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఎల్‌ఐసి బిల్డింగ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం నుంచి మహా ప్రదర్శన ప్రారంభం కానుంది. డాబాగార్డెన్స్, పెన్‌స్కూల్, జగదాంబ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు మీదుగా సభాస్థలి అయిన ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకోనుంది. 4 గంటలకు బహిరంగ సభ ప్రారంభమై 6.30 వరకూ జరుగనుంది. మహా ప్రదర్శన, బహిరంగ సభ నేపథ్యంలో ఇప్పటికే విశాఖ నగరం ఎర్రజెండాలు, తోరణాలతో సుందరంగా ముస్తాబైంది. బహిరంగ సభకు ఉత్తరాంధ్ర జిల్లాలు, విశాఖ నగరం సహా రాష్ట్రం, దేశంలోని పలు ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివస్తున్నారు. వారినుద్దేశించి సభలో సిఐటియు అఖిల భారత నాయకత్వం మాట్లాడనుంది. పోరాటాలకు దిశానిర్దేశం చేయనుంది.

విప్లవ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

విద్యార్థులకు మట్టి పరీక్షలపై వర్క్‌షాప్

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బిఎస్సి మహిళా విద్యార్థినిలకు ఏరీస్ అగ్రో లిమిటెడ్ సహకారంతో "మట్టి పరీక్షలు, విశ్లేషణ"పై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్ర, శనివారాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ . వి.చిట్టిబ్బాయి ప్రారంభించి ప్రసంగించారు. శాస్త్రీయ మట్టి పరీక్షల ప్రాముఖ్యత, స్థిరమైన వ్యవసాయంలో వాటి పాత్రను వివరించారు. విద్యార్థులు ప్రాయోగిక జ్ఞానం పొందుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా విజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్. రసూల్ ప్రసంగిస్తూ, నైపుణ్యాభివృద్ధి ఆధారిత శిక్షణ, పరిశ్రమ, విద్యాసంస్థల సమన్వయం ద్వారా విద్యార్థుల ఉద్యోగావకాశాలు, ప్రాయోగిక సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. ఏరీస్ అగ్రో లిమిటెడ్‌కు చెందిన జెడ్‌జెడ్ ఎమ్ కె.కృష్ణారావు, ఏజెడ్‌ఎం. ఎస్.అశోక్ బాబు మట్టి నమూనాల సేకరణ విధానాలు, పోషక తత్వాల విశ్లేషణ, మట్టి పరీక్షల ఫలితాల, పంటల నిర్వహణలో వాటి ఉపయోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పసికందు మృతిపై ఆందోళన

-వైద్యసేవల్లో నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
-బాధ్యులైన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి, చింతపల్లి: వైద్యసేవల్లో నిర్లక్ష్యం వల్లే రెండు నెలల పసికందు మృతి చెందిందని ఆరోపిస్తూ శనివారం చింతపల్లిలో ఆందోళన చేపట్టారు. చిన్నారి మృతికి బాధ్యులైన వైద్య నిపుణురాలిని వెంటనే విధుల నుంచి తొలగించి సస్పెండ్ చేయాలని బాలుడి తల్లిదండ్రులు తాంబేలి చిట్టిబాబు, రాజేశ్వరి డిమాండ్ చేశారు పాడేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు నేతృత్వంలో కాంగ్రెస్‌కార్యాలయం నుంచి చింతపల్లి ఏరియా ఆసుపత్రి వరకు ర్యాలీ చేపట్టారు. డాక్టర్‌ను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని, మన్యంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వంతల సుబ్బారావు మాట్లాడుతూ, డిసెంబర్ 31న పసికందుకు ఇంట్లో రెండు సార్లు వాంతులు రావడంతో తల్లిదండ్రులు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. అక్కడ చిన్నపిల్లల వైద్య నిపుణురాలు ప్రభావతి మూడు ఇంజక్షన్లు, నాలుగు భాటీలు అధిక మోతాదులో ఇచ్చినట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని అన్నారు. అనంతరం బాబు శరీరమంతా ఉబ్బిపోవడం, ముక్కు ద్వారా రక్తం కారడం వంటి లక్షణాలు కనిపించినప్పటికీ తగిన పర్యవేక్షణ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి సమయంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పసికందు మ తి చెందినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. మ తికి గల కారణాలపై ప్రశ్నించేందుకు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి వెళ్లగా సంబంధిత వైద్య నిపుణురాలు అందుబాటులో లేకపోవడంతో బాలుడి మ తదేహాన్ని స్వగ్రామం చెదలపాడు తరలించాల్సి వచ్చిందన్నారు.



ఆందోళన చేపడుతున్న కుటుంబీకులు, గ్రామస్తులు

బంతి పూలకు గిట్టుబాటు ధర ఏదీ?

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని సీమబంతి వంటి పూవ్వులు అక్టోబర్ నుంచి జనవరి వరకు పుష్పించే కాలం కావడంతో రైతులు పూల సాగుపై ఆశలు పెట్టుకున్నారు. దాలి గుమ్మడి, చింతల వీధి, దిగుడు పుట్టు ప్రాంతాలకు చెందిన రైతులు హుకుంపేటలో శనివారం సంతకు గంపలతో పూలను అమ్మకాలకు తీసుకొచ్చారు. పూలకు భక్తులు, వ్యాపారుల నుంచి కొంతమేరకు డిమాండ్ ఉన్నప్పటికీ ధరలు ఆశించిన స్థాయిలో లేక పోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఒక్కో గంప ధర రూ.20 నుంచి రూ.50 వరకు మాత్రమే పలుకుతోంది. గంప 100 నుంచి 150 వరకు కొనుగోలు చేపడితే కష్టించిన ఫలితం దక్కుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ ధరలు తమకు నష్టాలను మిగులుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి పూల రైతులకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

సంతకు బంతి పూల బుట్టలను తీసుకొచ్చిన మహిళలు

పోలవరం జిల్లాకు

పూర్తి స్థాయి వసతులు ఉండాలి

- ఉన్నతాధికారులను నియమించాలి
- ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- ఆర్టీసీ డిపో, బస్సు సర్వీసులు అవసరం
- రంపచోడవరం కేంద్రంగా మెడికల్ కళాశాల ఉండాలి
- ఎఎస్‌ఆర్ రంపచోడవరం

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెనకిరణ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పోలవరం జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అయితే ఇక్కడ జిల్లా కలెక్టర్, ఎస్పీ పూర్తి స్థాయి జిల్లా అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలని ఎఎస్‌ఆర్ రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం రంపచోడవరంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడా రు. పోలవరం జిల్లా రంపచోడవరం ముఖ్య కేంద్రంగా రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కూడిన 12 మండలాలతో ఏర్పడిందన్నారు. ఈ జిల్లా ప్రధానంగా ఆదివాసీలు నివసించే ప్రాంతం కాగా, పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగి పోయే గ్రామాల పునరావాసం, అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించేలా రూపొందించారు కాని, ఈ నూతన జిల్లా ఏర్పాటుతో పాటు తక్షణమే పూర్తిస్థాయి ఉన్నతాధికారులను నియమించడం, కొత్త కలెక్టరేట్ భవనాలు, ఇతర కార్యాలయాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన జరగకపోతే జిల్లా ఏర్పాటు ప్రయోజనం నెరవేరదన్నారు. ఇదే తరహా పరిస్థితి గతంలో అల్లూరి సీతారామరాజు (పాడేరు) జిల్లాలో కనిపించింద న్నారు. 2022లో ఏర్పడిన పాడేరు జిల్లా కేంద్రం నుండి రంపచోడవరం, చింతూరు వంటి మారుమూల మండలాల్లోని ఆదివాసీ ప్రజలకు సేవలు అందడం లేదని దూరం, రవాణా సమస్యల వల్ల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సరిగా అమలు కాలేదన్నారు. అదే పరిస్థితి పోలవరం జిల్లాలో కొనసాగితే నూతన జిల్లా ఏర్పాటు అర్థం లేనిదవుతుందని ఈ నేపథ్యంలో సిపిఎం పోలవరం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని పూర్తి స్థాయి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఉన్నతాధికారులను నియమించాలని కార్యాలయాలు త్వరగా ఏర్పాటు చేయాలని, జిల్లా పరిధిలో ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేయాలని, చుట్టుపక్కల జిల్లాలతో అనుసంధానం చేసేలా బస్సు సర్వీసులు పెంచాలన్నారు. రంపచోడవరం కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించాలని, మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఈ మేరకు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్‌ఆర్ రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

పోలీసులు స్వాధీనం చేసుకున్న కలప

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలపను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రాజవొమ్మంగి అటవీ రేంజ్ పరిధిలోని కాకరపాడు శివారు ప్రాంతంలో శనివారం వాన్‌లో 40 బిల్లేడు (మారుజాతి) దిమ్మలు రవాణా చేస్తుండగా సమాచారం అందుకున్న రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి ఆధ్వర్యంలో అటవీ సిబ్బందితో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకు న్నారు. అడ్డతీగల మండలం దాకోడి నుండి కాకరపాడు మీదుగా నర్సీ పట్నం కలప తరలిస్తున్న వాహనాన్ని రేంజ్ కార్యాలయానికి తరలించారు. వ్యాన్ డ్రైవర్, మరో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి సమాచారం సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజర్ ఉషారాణి తెలిపారు. ఎఫ్ఎస్ఒ రాము, ఎఫ్‌బిఒ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నిలబడి నిరసన తెలుపుతున్న మండలపరిషత్ సభ్యులు

గౌరవ వేతనాలు ఇవ్వాలని మండల పరిషత్ సభ్యుల నిరసన

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రెండున్నరేళ్లుగా సర్పంచులకు ఎంపిటిసి సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంపై ఎంపిపి కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీరత్నం, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు కేఎస్ ప్రభాకర్, వైస్ ఎంపిపి రామ తులసి గంగాదేవి ఆధ్వర్యంలో సర్పంచులు ఎంపిటిసిలు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గౌరవ వేతనాలు మంజూరు చేయకపోవడం చాలా అవమా నకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామ ని కూర్చోవాలని ఎంపిడిఒ లక్ష్మణరావు సభ్యులను కోరినా వారు వినలేదు. సమావేశం మొత్తం నిలబడే ఉన్నారు. వైద్యాధికారి భావన, వ్యవసాయా ధికారి విశ్వనాథ్, ఎంఇఒ మల్లేశ్వరరావు, ఎపిఒ ప్రకాష్ పాల్గొన్నారు.

రేపు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఈనెల 5న మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గార్బేజ్ ఫ్రీ విలేజ్ లే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ గ్రామసభలు జరగుతున్నాయన్నారు. అందరు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, గ్రామసభల్లో పాల్గొని తమ గ్రామాల్లో చెత్త లేకుండా అధికారులకు సహకరిస్తామని గ్రామసభల్లో తీర్మానాలు చేయనున్నారని తెలిపారు.

7న సర్వసభ్య సమావేశం

ఈ నెల 7వ తేదీన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరావు శనివారం తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి

మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలంలో ఈ నెల ఐదో తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజీవికా మిషన్ (గ్రామీణ) పథకాన్ని 12 పంచాయతీల్లో నిర్వహించేందుకు ప్రతి పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎపిఒ మణికుమారి ప్రకటనలో తెలిపారు. గ్రామసభలకు మారేడుమిల్లి మండల అభివృద్ధి అధికారి రవికిషోర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు గ్రామంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు, కూటమి పెద్దలు శ్రామికులు గ్రామ సభకు హాజరై వారి అభిప్రాయాలను తెలపాలన్నారు. ఈ సభలో పంచాయతీలోని లబ్దిదారులను గుర్తించి వారి పేరున పనులు మంజూరు చేసి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు.

ఎం.తేజోవతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

అరకు పార్లమెంట్ టిడిపి అధ్యక్షురాలు తేజోవతి

ప్రజాశక్తి-రాజవమ్మంగి: టిడిపిలో పార్టీని నమ్ముకుని ఉన్నవారికి గుర్తింపు ఉంటుందని టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు ఎం.తేజోవతి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తేజోవతిని ఎమ్మెల్యే శిరీషాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే శిరీషాదేవి నామినేటెడ్ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులను పరిచయం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో తేజోవతి మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కూడా కలసిరావాలన్నారు. పోలవరం ప్రత్యేక జిల్లా ప్రకటించిన ఘనత టిడిపిదే అన్నారు. ప్రతి నెల రెండో శనివారం, ఆదివారం అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, ఎపిఐఐసి డైరక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ షేక్‌సుబానీ, ఎఎంసి ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ తీసుకునేందుకు టెన్షన్

రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తమ పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు బ్యాంకుకు వెళితే క్యాష్ లేదని చెబుతున్నారని పెన్షనర్స్ శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెన్షన్ తీసుకునేందుకు యూనియన్ బ్యాంకుకు వెళ్లగా క్యాష్ లేదని తమని వెనక్కి పంపించేశారని ఈ బ్యాంకులో దాదాపు తరచూ ఇదే పరిస్థితిని నెలకొంటోందని పెన్షనర్స్ అస్సోసియేషన్ అధ్యక్షుడు కృష్ణవర్మ ఆరోపించారు. ఈ బ్యాంకు పరిధిలో సుమారు వంద మంది పెన్షనర్లు ఉన్నారని, దూర ప్రాంతాల నుంచి పెన్షన్ తీసుకోడానికి బ్యాంకుకు వచ్చిన వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

గిరిజన వృద్ధుడికి వైద్యసేవలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి గ్రామానికి చెందిన కిలో సోమర (60) రెండు వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడు తుండడంతో స్థానికులు వైద్యాధికారి నారాయణరావుకు సమాచారం అందించారు. ఆయన స్పందించి వలసపల్లికి అంబులెన్స్ పంపించి సీలేరు పిహెచ్‌సికి తరలించి వైద్యసేవలందించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమరకు మలేరియా, హెచ్‌బి పరీక్షలు నిర్వహించామని, మలేరియా నెగెటివ్ వచ్చిందని, టిబి సోకిఉండవచ్చని భావిస్తున్నామని మెరుగైన చికిత్స కోసం చింతపల్లి ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశామన్నారు.

సోమరను తరలిస్తున్న స్థానికులు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

డుంబ్రిగుడలో నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ :మండల కేంద్రంలో స్థానిక యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యస్ బాలకృష్ణ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి -2 గేన్ను మాట్లాడుతూ, సావిత్రిబాయి స్త్రీల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. యూటీఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు కె రఘునాథ్, జిల్లా కార్యదర్శి యస్ కన్నయ్య మాట్లాడుతూ, స్త్రీలు ఈనాడు ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఫలితమే అన్నారు.ఈ జయంతి వేడుకల్లో మండల ప్రధాన కార్యదర్శి కె రాజారావు, ట్రెజరర్ జి దుక్కు, కార్యదర్శి కె సీతన్న, యూటీఎఫ్ సభ్యులు జె.కొండలరావు, పరిడి హెచ్ఎం వసంత, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండలంలోని జర్రెల పంచాయతీ సెల్లుంపుట్ ఎంపీపీ పాఠశాలలో శనివారం హెచ్ఎం ధర్మారావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకను పాఠశాల విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం. ధర్మారావు మాట్లాడుతూ, మహిళలు చదువుకోవాలనే ఆశయంతో మహిళా పాఠశాలలు ఏర్పాటు చేసి ఆనాటి సాంఘిక పరిస్థితులకు ఎదుర్కొంటు బాల్య వివాహాలకు, సతీసహగమన దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అని తెలిపారు. తన అడుగుజాడల్లో పయనిస్తూ సమసమాజ స్థాపనకు మహిళా ఉపాధ్యాయులంతా ముందడుగు వేయాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ఆర్. కామేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాతృభాష వాలంటరీ మోహన్, బోధనేతర సిబ్బంది దోనమ్మ, పార్వతి, రుకునా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాశీపట్నం: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు అనంతగిరి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల-2 లో ఘనంగా జరిగాయి. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ అధ్యక్షతన జయంతిని ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేశారు. ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ మాట్లాడుతూ.. స్త్రీ విద్య కోసం, హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త, అభ్యుదయవాది సావిత్రిబాయి పూలే అన్నారు. ఆ మహనీయురాలు తొలి ఉపాధ్యాయురాలుగా, సంఘ సంస్కర్తగా భారతీయ సమాజానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. పూలే జయంతిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినులు సావిత్రిభాయి వేషధారణలో ఏకపాత్రాభినయం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగాభవాని, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో నివాళులర్పిస్తున్న హెచ్ఎం

రాజవమ్మంగి: మండలంలోని సింగంపల్లి ఆశ్రమపాఠశాలలో శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జాతీయమహిళా ఉపాధ్యాయ దినోత్సవాలు నిర్వహించారు. తొలుత సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుబ్రహ్మణ్యేశ్వరి, పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ, మహిళల హక్కుల పోరాటానికి, స్వతంత్రతకు ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు లోవరాజు, వెంకటలక్ష్మి, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మనువాదాన్ని కాలదన్ని మహిళలకు అక్షరాలు నేర్పిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొయ్యూరు మండలం పెదమాకవరం గిరిజన సంక్షేమబాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సంధ్య అన్నారు. శనివారం పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్నమాణిక్యం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారత దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలే కాకుండా గొప్ప సంఘసంస్కర్త కవయిత్రి అన్నారు. వైస్ ప్రిన్సిపల్ శేఖర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి అప్పనమ్మ, తెలుగు విభాగాధిపతి లక్ష్మీ ప్రసన్నకుమారి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమాణిక్యం

మారేడుమిల్లి: మండల పరిషత్ ప్రాథమికపాఠశాల మారేడుమిల్లిలో సావిత్రిబాయి పూలే జయంతి మండల సహాధ్యక్షురాలు దయామని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధాన కార్యదర్శి కష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు అంజనిరెడ్డి హాజరయ్యారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, నీలవేణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కాశీపట్నంలో పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కాశీపట్నం:అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ పందిరి మామిడి వలస, కాటిమామిడివలస, మర్రిమానివలస గ్రామాలకు చెందిన రైతులకు కాశీపట్నం సచివాలయంలో సర్పంచ్ జనపరెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సారవానిపాలెం పీసా కమిటీ క్లస్టర్ ఉపాధ్యక్షులు గేదెల అంగరయ్య, కార్యదర్శి కాకర సింగులు, మూతిబోయిన సన్యాసిరావు, ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, అనంతగిరి ఆర్ఐ జగ్గయ్యమ్మ, కాశీపట్నం పంచాయతీ వీఆర్వో ఎల్ బి అనిల్, సర్వేయర్ అశోక్, వార్డు సభ్యులు తామర రాంబాబు, టిడిపి నాయకులు దొండపర్తి పుష్పానందం, కాశీపట్నం సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తామర పెళ్లి సూర్యనారాయణ, రాకోటి సింగప్ప, కొఠారి గంగులు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని సంతారి పంచాయ తీలో నూతన భూ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ శనివారం నిర్వహించారు. టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆర్డీఓ లోకేష్, తహసిల్దార్ శ్రీనివాసరావుతో కలిసి రైతులకు రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పాస్ పుస్తకాలపై ఆనాటి ముఖ్యమంత్రి ఫోటో వేయడంతో రైతుల్లో భూములు పోతాయనే భయాలు నెలకొన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు నూతన పాస్ పుస్తకాలను రాజముద్రతో విడుదల చేయడం శుభపరిణామమన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హుకుంపేటలో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దొన్నుదొర, ఆర్డిఒ తదితరులు

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న గంగరాజు, ఎంఇఒలు

ప్రజాశక్తి- అనంతగిరి:ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండల కేంద్రంలో జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పి .దేముడు ఆధ్వర్యంలో జెడ్పిటిసి గంగరాజు, ఎంఇఒలు బాలాజీ, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.మంగమ్మ ఆవిష్కరించారు. జెడ్పిటిసి మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సంఘం యుటిఎఫ్ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జె.దేముడు, నారాజి.మల్లేశ్వరరావు, మండల ఆడిట్ కమిటీ కన్వీనర్ బి .విజయ్ కుమార్, యూనియన్ సీనియర్ నేత బి .సత్యనారాయణ పడల్, .సుబ్బారావు, సీనియర్ నేత వంతల .భాస్కరరావు, జిల్లా కౌన్సిలర్ కమిటీ ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

సంతలో సంక్రాంతి సందడి

ప్రజాశక్తి -హుకుంపేట:హుకుంపేట సంతలో శనివారం సంక్రాంతి పండగ శోభ ముందుగానే కనిపించింది. సంక్రాంతి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకు తరలివచ్చారు. తమ వ్యవసాయ ఉత్పత్తులు, హతా ఉత్పత్తులను విక్రయించేందుకు రైతులు, వ్యాపారులు అధికంగా రావడంతో సంత కళకళలాడింది. చలికాలం కొనసాగుతున్నందున పిల్లల నుంచి పెద్దల వరకు చలి దుస్తులు, నూతన వస్త్రాల కొనుగోళ్లు భారీగా జరిగాయి. పండగ అవసరాల కోసం కూరగాయలు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేయడంలో ప్రజలు ఆసక్తి చూపారు. ముఖ్యంగా కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పండగకు కోళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపడంతో విక్రయాలు జోరుగా సాగాయి. మరోవైపు ఒరిస్సా నుంచి వచ్చిన వ్యాపారులు థింసా నృత్యాలకు సంబంధించిన డప్పులు, సంప్రదాయ వాయిద్య పరికరాలను కొనుగోలు చేశారు.

సంతలో యువకులు

దొరబాబుకు పూర్ణచంద్రరావు పరామర్శ

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తోట దొరబాబుని శనివారం చింతపల్లి మండల అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు కలిశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన టిడిపి నేత దొరబాబు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానికసంస్థల ఎన్నికల గురించి చర్చించినట్టు తెలిపారు. రత్నంపేట మాజీ సర్పంచ్ శంకరరావు, మండల కో క్లస్టర్ ఇన్‌చార్జి కీర్తికుమార్, నల్లగొండ యూనిట్ ఇన్‌చార్జి లోత సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

జైపాల్ సింగ్ ముండాకు నివాళులర్పిస్తున్న ఎపి ఆదివాసి జెఎసి నాయకులు

పోలవరం జిల్లాపై అభిప్రాయ సేకరణకు ప్రత్యేక తేదీలు ప్రకటించాలి

ఎపి ఆదివాసీ జెఎసి, ఆదివాసీ మహాసభ డిమాండ్

దేవీపట్నం- ప్రజాశక్తి: పోలవరం పేరును ఆదివాసీలు అధికంగా ఉన్న జిల్లాకు పెట్టడం సమంజసం కాదని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు వలన సర్వం కోల్పోయి ఆదివాసీలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, గిరిజనేతరులకు లాభం కలుగుతోందన్నారు. కావున రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్ 12 మండలాలను కలిపి పోలవరం జిల్లా ప్రకటించే కంటే, ప్రస్తుత పోలవరం డివిజన్, సబ్ ప్లాన్‌లో ఉన్న అన్ని గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి తొలి స్వతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర పేరుతో రంపచోడవరం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ సభ సభ్యులు జైపాల్ సింగ్ ముండా జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుర స్పందించి పీసా గ్రామసభల ద్వారా పోలవరం జిల్లాపై అభిప్రాయాలు తీర్మానాల ద్వారా స్వీకరించేందుకు ప్రత్యేకమైన తేదీ సమయం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, అరగాటి వీరభద్రారెడ్డి, నాగిరెడ్డి, నడిపూడి గాంధీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులు ఉద్యమ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మాట్లాడుతున్న పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - రాజవమ్మంగి: రంపచోడవరం డివిజన్‌లో వివిధ వ్యాపారాలు చేసే వ్యాపారస్తులు చిన్నపరిశ్రమలు నిర్వహిస్తున్న యజమానులు తప్పనిసరిగా ఉద్యమ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ సూచించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో శనివారం అన్ని మండలాలకు చెందిన వెలుగు ఎపిఎంలు, ఎపిఐఓలతో, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు, మినీ పరిశ్రమలు నిర్వహిస్తున్న వారికి ఉద్యమ రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేసింద న్నారు. బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఇకెవైసి, పెట్టుబడి వివరాలు, ఉద్యోగుల సంఖ్య వివరాలు, వ్యాపారాలలో రకాల భాగస్వామ్యం, కంపెనీ వివరాలు, ఆధార్ కార్డుల తో మొబైల్ నంబర్ తప్పనిసరిగా లింకై ఉండాలన్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లా పరిశ్రమల శాఖాధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ఆరోగ్యం నాశనం

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు

అడ్డతీగల: సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సిఐ నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్

కొయ్యూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్

రాజవొమ్మంగి: ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ శివకుమార్

ప్రజాశక్తి - కొయ్యూరు : మత్తుపదార్థాల వినియోగంతో ఆరోగ్యం నాశనమవుతుందని సిఐ శ్రీనివాసరావు సూచించారు. కాకరపాడు జంక్షన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శనివారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మంప ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజవమ్మంగి: డ్రగ్స్ సేవించడం వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ అన్నారు. రాజవమ్మంగిలో పోలీసు లు డ్రగ్స్‌కి వ్యతిరేకంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నేడు ఇచ్ఛాపురంలో అభ్యుదయం సైకిల్‌యాత్ర ముగింపు కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొననున్న నేపథ్యంలో విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో ప్రజలకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారని ఎస్ఐ తెలిపారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని డ్రగ్స్‌కి ముఖ్యంగా గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల: గంజాయి మాదకద్రవ్యాల వల్ల కలిగేనష్టాలను సిఐ నరసింహమూర్తి అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై వినోద్, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి రవాణా చేసినా, ఎవరికైనా సహకరించినా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ర్యాలీలో అధికసంఖ్యలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు హాజరు...ఉపాధ్యాయుడు గైర్హాజరు..

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి ఎంపిపి పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై ఉన్న వీధికుక్కలతో ఆడుకుంటున్నారు. స్థానిక విలేకరులు పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు రోడ్డుపై కనిపించడంతో విచారణ చేయగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో చదువుకుంటారని పాఠశాలకు పంపిన తమ పిల్లలు ఇలా రోడ్డున పడుతున్నారని వాపోయారు. వలసపల్లి ఎంపిపి పాఠశాలలో వలసపల్లి, మునసపల్లి గ్రామాలకు చెందిన 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు రాలేదని చెబుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) రోడ్డుపై ఆడుకుంటున్న విద్యార్థులు

విశాఖలో భారీ క్రిప్టో ఎంఎల్ఎం మోసం

- నలుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: క్రిప్టో కరెన్సీ ముసుగులో సాగుతున్న మరో భారీ ఆర్థిక కుంభకోణాన్ని విశాఖపట్నం సైబర్ క్రైం పోలీసులు ఛేదించారు. అధిక లాభాలు, గ్యారెంటీ రిటర్న్ అంటూ సామాన్యులను ఊరించిన ఒక మల్టీ లెవెల్ మార్కెటింగ్ ముఠా గుట్టును పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బృందం రట్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి కీలకమైన స్టార్ రేటింగ్ నిర్వాహకులను అరెస్టు చేసినట్లు సిపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిపి కథనం ప్రకారం... నిందితులు పలు పేర్లతో వివిధ క్రిప్టో టోకెన్లను సృష్టించి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 50 డాలర్ల నుండి 10వేలు డాలర్ల వరకు పెట్టుబడి పెడితే రోజుకు 0.4 శాతం వడ్డీ ఇస్తామని, అది కూడా 500 రోజుల పాటు నిరంతరం చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఇందులో ఎటువంటి వాస్తవ వ్యాపారం లేదు. కేవలం కొత్తగాచేరే సభ్యుల డబ్బును పాతవారికి కమీషన్ల రూపంలో పంచుతూ పోంజీ తరహాలో ఈ వ్యవస్థను నడిపించారు. పేరుతో మోసం బయటపడుతుందని తెలిసినప్పుడల్లా నిందితులు తెలివిగా టోకెన్ పేరును మార్చేవారు. మొదట యుటిఎం అని, ఆ తరువాత యుబిట్, అనంతరం ఉల్ట్రవేర్స్, చివరిగా ఎంఎంఎంసి అని పేర్లు మారుస్తూ పెట్టుబడిదారులను గందరగోళానికి గురి చేశారు. కేవలం రిఫరల్ కమీషన్ల ద్వారా 50 స్థాయిల వరకు చైన్ సిస్టమ్ నడిపినట్లు దర్యాప్తులో తేలింది. ఎక్కువ మందిని చేర్చిన వారికే స్టార్ రేటింగ్ హోదాలతో పాటు విదేశీ ట్రిప్పులు, లగ్జరీ కార్లు, విల్లాల వంటి ఆశలు చూపారు. అత్యంత సాంకేతిక నైపుణ్యంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు ప్రధాన నిందితులైన నాగిరెడ్డి సుధీర్‌నాయుడు, గురాల శ్రీకాంత్, మంగి సోమరాజు, అల్లిపిల్లి వెంకట రమేష్‌బాబులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుండి భారీసంఖ్యలో యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు సేఫ్‌పాల్, బైనాన్స్ వంటి క్రిప్టో వాలెట్ వివరాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు తరలించగా, 13 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఇప్పటికి నాలుగుజిల్లాలు మార్చారు

- ముంపు మండలాల వాసుల వేదన

ప్రజాశక్తి - విఆర్‌పురం: విభజన నేపథ్యంలో ఇప్పటికీ ఏజెన్సీ మన్యం వాసులు ఐదో జిల్లాగా మారాల్సిన ఆవశ్యకత కలిగింది. ముందుగా విభజన నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో ఉన్న ముంపు మండలాలను 2018 సెప్టెంబర్ 21న ఏడు మండలాలను ఆంధ్రాలో విలీనం చేసి తూర్పుగోదావరిలోకి విఆర్‌పురం, కూనవరం, ఎటపాక, చింతూరు, పశ్చిమగోదావరిలోకి కుక్కునూరు, వేలేరుపాడు బూర్గంపాడులో కొన్ని గ్రామాలు కలిపారు. అనంతరం వైఎస్‌జగన్ ప్రభుత్వ హయాంలో తూర్పు గోదావరిలో ఉన్నటువంటి ఏడు మండలాలను పాడేరులో కలిపి అల్లూరి జిల్లాలో విలీనం చేశారు. జిల్లా కేంద్రం దూరంగా ఉన్న నేపథ్యంలో మన్యంవాసుల ఇబ్బందులను అప్పటి ప్రతిపక్షనేత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఇక్కడ ప్రాంతవాసులు ప్రజాప్రతినిధులు విన్నవించారు. దీంతో జిల్లా మార్పు జరిగింది. జనవరి 1 నుండి రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ప్రకటించారు. మొత్తం మీద విభజన నాటి నుండి ఇప్పటికి ఈ ప్రాంత వాసులు 4 జిల్లాలు మారారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులవుతున్న గిరిజనేతర కుటుంబాలను రిహాబిటేషన్ రీ సెటిల్‌మెంట్ ఆర్అండ్ కాలనీ ఏలూరు జిల్లాలోని తాడువాయిలో కేటాయించారు. ఇకవారు ఈ ప్రాంతం నుండి తరలివెళితే అక్కడికి వెళ్లాక ఏలూరు జిల్లాలోకి మారాల్సి ఉంటుంది. ఏజెన్సీ మండలాలను ఆనాడు తూర్పుగోదావరిలో విలీనం చేశారు. లేకపోతే ఇప్పటికీ ఈ ఏడు మండలాలు ఖమ్మం జిల్లాలోని భద్రాచలం నియోజకవర్గం బూర్గంపాడు నియోజకవర్గంలోనే ఉండేవి అనేది నగ్నసత్యం. ఇప్పటికే మూడుసార్లు వివిధ డాక్యుమెంట్స్, ఆధార్‌కార్డులు రేషన్‌కార్డులు జిల్లాలు మారినప్పుడల్లా ప్రజలు తమతమ చిరునామాలను జిల్లాలను మార్చుకోవాల్సి నటువంటి పరిస్థితి నెలకొంటోంది. ప్రభుత్వమే మళ్లీ ఆధార్‌లో జిల్లాల మార్పు, డివిజన్లో మార్పు ఇలా అన్నీ మార్పు చేయించాలని ముంపువాసులు, నిర్వాసితులు కోరుతున్నారు.

కొత్త మోటార్ వేయిస్తున్న సర్పంచ్

తీరిన తాగునీటి సమస్య

ప్రజాశక్తి - కూనవరం: పెద్దఆర్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రేపాకలో ఒహెచ్ఆర్ ట్యాంకుకు సంబంధించిన మోటార్ పాడైపోయి ఉంది. దీంతో గ్రామ స్తులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బం దులు పడుతున్నారు. సర్పంచ్ నాగమణి చొరవతో పంచాయతీ 15వ సంఘ నిధులతో కొత్తమోటార్ ప్యానల్‌బోర్డు, వైరు ఏర్పాటు చేసి తాగునీటిని పున:సరఫరా చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- చింతపల్లి : మండల కేంద్రం చింతపల్లిలో రూ.22 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ఎంపిపి కోరాబు అనూషాదేవి, సర్పంచ్ దురియా పుష్పలత శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జయలక్ష్మి, వార్డు సభ్యుడు చిట్టిబాబు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు మోహన్, వైసిపి నేత సుధాకర్, కూటమి నాయకుడు లక్కోజు నాగభూషణం, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి అనూషాదేవి, సర్పంచ్ పుష్పలత